క్లుప్తంగా

ఆలయ గోపుర నిర్మాణానికి విరాళం



సర్పంచ్ సంజీవరావుకు నగదు అందజేస్తున్న అప్పలనాయుడు కుటుంబ సభ్యులు

మాడుగుల: ఎం. కోడూరులో మోదకొండమ్మ ఆలయ గాలిగోపురం నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు కుటుంబ సభ్యులు కృష్ణవేణి, హరికృష్ణ, ప్రసాద్ రూ.10 వేల విరాళం ప్రకటించారు. ఈ మొత్తాన్ని సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావుకు సోమవారం వారు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు సింగన్నదొరపాలెంలో ఫ్యామిలీ డాక్టరు

కె.కోటపాడు: సింగన్నదొరపాలెంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైద్యాధికారి నిర్మల సోమవారం తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు వ్యాధిగ్రస్తులకు వైద్య సేవలందించడంతోపాటు అవసరమైన వారికి మందులు పంపిణీ చేస్తామన్నారు.

వడ్డాదిలో పూరిల్లు దగ్ధం



మంటల్లో కాలిపోతున్న పూరిల్లు

బుచ్చెయ్యపేట: వడ్డాదిలో పూరిల్లు దగ్ధమైంది. ఆదివారం దీపావళి పండగ సందర్భంగా కొంతమంది యువకులు వేసిన తారాజువ్వలు వెలిగించారు. వాటి నుంచి అగ్గినిప్పులు గ్రామానికి చెందిన యలమంచిలి ఈశ్వరరావు పూరింటిపై పడి మంటలు వ్యాపించాయి. వెంటనే గ్రామస్తులు మంటలార్పడానికి ప్రయత్నించే లోపే ఇల్లంతా కాలిపోయింది. కట్టుబట్టలతో రోడ్డున పడ్డ నిరుపేద ఈశ్వరరావు కుటుంబ సభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

ఎల్.బి. పట్నంలో అతిసార

మాడుగుల ఆస్పత్రిలో ఇద్దరు బాధితులకు చికిత్స

చీడికాడ: ఎల్.బి.పట్నంలో అతిసార బారిన పడిన నలుగురు అస్వస్థతకు గురైనట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలలోకి వెళ్తే.. గ్రామానికి చెందిన మురుకుర్తి ఈశ్వరమ్మ, మురుకుర్తి వెంకటలక్ష్మి, కలిగొట్ల వెంకయమ్మ, దాసరి రవణమ్మ ఆదివారం సాయంత్రం వాంతులు, విరేచనాలతో బాధపడుతుండగా.. కుటుంబ సభ్యులు మాడుగుల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కలిగొట్ల వెంకటలక్ష్మి, దాసరి రవణమ్మల ఆరోగ్యం మెరుగుపడటంతో సోమవారం డిశ్చార్జి అయ్యారు. మిగిలిన ఇద్దరు ఇంకా చికిత్స పొందుతున్నారు. సోమవారం ఉదయం పంచాయతీ కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్, ఏఎన్ఎం బాధితుల ఇళ్ల వద్ద నీటి శాంపిల్స్ సేకరించారు. గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఇక్కడ వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గొర్రెలు, మేకల సంతలో తగ్గిన గిరాకీ



తాళ్లపాలెం సంతలో గొర్రెలు, మేకల అమ్మకాలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం గొర్రెలు, మేకలు అమ్మకానికి తక్కువగా వచ్చాయి. కార్తీక మాసం రాకతో వీటికి గిరాకీ తగ్గింది. కొంతమంది వ్యాపారులు, పెంపకందారులు ఆశించిన ధర లభించక గొర్రెలు, మేకల్ని తిరిగి తమ ప్రాంతానికి తీసుకెళ్లారు. కూరగాయల ధరలు దాదాపు స్థిరంగా ఉన్నాయి. కిలో దొండకాయ రూ.20, బంగాళాదుంప కిలో రూ.30, వంకాయ, బెండకాయ, టమాటా రూ.40, క్యారెట్, బీట్రూట్, బీరకాయ రూ.60, క్యాప్సికం రూ.80కి అమ్మకాలు సాగాయి.

నేటి నుంచి కార్తీక మాసోత్సవాలు

- ముస్తాబైన శివాలయాలు
- నెల రోజులపాటు నిత్య పూజలు, అభిషేకాలు
- రోజూ సాయంత్రం ఆకాశ దీపారధన



దబ్బకుంటు రహదారిలో పార్వతీ సమేత భీమలింగేశ్వర స్వామి ఆలయం

మాడుగుల రూరల్: కార్తీక మాసోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. హరిహరులకు అత్యంత ప్రీతికరమైన మాసం కావడంతో నెల రోజులపాటు భక్తులు పూజించుకునేందుకు శివాలయాలను ముస్తాబు చేసారు. ఈ మాసోత్సవాలు వచ్చే నెల 13వ తేదీ పోలిపాడ్యమితో ముగిస్తాయి. ఈ సందర్భంగా కె.జె.పురం చెరకు కాటా ఆవరణలో కాశీ విశ్వేశ్వర స్వామివారికి నెల రోజులపాటు రోజూ ఉదయం, సాయంత్రం అభిషేకాలు, పూజలు, సాయంత్రం ఆకాశ దీపార్చన చేయనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు హేమాద్రిబట్ల సత్యనారాయణమూర్తి తెలిపారు. అతి పురాతనమైన వీరవల్లి అగ్రహారం కాశీ విశ్వేశ్వర స్వామి వారి శివాలయంతోపాటు జంపెన, పిట్టగెడ్డ, వంటర్లపాలెం, వి.జె.పురం, వీరనారాయణం, కె.జె.పురం జంక్షన్‌లో కల్యాణ వేంకటేశ్వర స్వామి, దబ్బకుంటు రహదారిలో ఉమా పార్వతీ సమేత భీమలింగేశ్వర స్వామివారి ఆలయాలను సర్వం సిద్ధం చేశారు.

ఎం. కోడూరు కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో..

ఎం. కోడూరు తాచేరు నది ఒడ్డున కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాలు సందర్భంగా మూడో కార్తీక సోమవారం పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు చింతా వెంకట నారాయణమూర్తి తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు.



ముద్దుర్తి సంగమేశ్వర ఆలయం వద్ద స్నానాల రేవు

నిర్లక్ష్యం మాటున నదీ స్నాన రేవులు

చోడవరం: పవిత్ర కార్తీక మాసంలో స్నానాల ఘాట్ వద్ద ముందస్తు జాగ్రత్త చర్యలు కానరావడం లేదు. భక్తులు ప్రమాదాలకు గురికాకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయలేదు. దాంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మంగళవారం నుంచి ప్రారంభమయ్యే కార్తీక మాసంలో నిత్యం స్నాన రేవులకు పెద్ద ఎత్తున భక్తులు తరలి రానున్నారు. తెల్లవారుజామున, సంధ్యా సమయంలో స్నానాలు చేసి కార్తీక దీపాలు వెలిగిస్తారు. మరో పక్క అయ్యప్పమాలధారణ భక్తులు ఇక్కడ రేవుల్లోనే స్నానాలు చేస్తారు. చోడవరం, మాడుగుల నియోజకవర్గాల మీదుగా ప్రధానమైన శారద, పెద్దేరు, తాచేరు, బొడ్డేరు, వరహా, సర్పానదులు ప్రవహిస్తున్నాయి. ఈ నదీ పరివాహక ప్రాంతాల్లో అనేక పవిత్ర స్నాన రేవులు ఉన్నాయి. పెద్దేరు, శారద, బొడ్డేరు మూడు నదులు చోడవరం మండలం ముద్దుర్తిలో కలుస్తాయి. ఈ ప్రదేశంలో పవిత్ర స్నాన రేవుగా శారదానది జిల్లాలో ప్రసిద్ధి గాంచింది. ఇక్కడ సంగమేశ్వర స్వామి ఆలయ స్నానఘట్టం ఉంది. అదేవిధంగా పెద్దేరు నది ఒడ్డున వడ్డాది వేంకటేశ్వస్వామి కల్యాణకట్ట, కల్యాణపులోవ రిజర్వాయరు వద్ద పోతురాజు బాబు ఆలయంతోపాటు గౌరీపట్నం మార్కమ్మ రేవు, గోవాడ, గజపతినగరం, జుత్తాడ, గవరవరం, ఎత్రిగెడ్డ కొత్తకోట, పెద్దచెరువు దొండపూడి, చిన్నకట్టు, పెట్టకట్టు కొత్తకోట, రోలుగుంట కోనేరు, పి.ఎస్.పేట, వీరవల్లి అగ్రహారం, తదితర స్నాన రేవులు ప్రధానమైనవి. ఈ రేవుల్లో భక్తులతో కిటకిటలాడుతాయి.



ప్రమాదకరమైన గౌరీపట్నం మార్కమ్మ రేవు

కానరాని హెచ్చరిక బోర్డులు

ఇటువంటి రేవుల వద్ద అడుగడునా ప్రమాదం పొంచి వుంది. పదేళ్లలో స్నానాలు చేస్తూ 21మంది మృత్యువాత పడగా, అనేక మంది కొన ఊపిరితో బయటపడ్డారు. ఈ నదుల్లో ఇసుక తవ్వకాల వల్ల పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. అటువంటి చోట గోతులు తెలియక స్నానాలకు దిగిన భక్తులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ముందస్తుగా రేవుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, రేవుల్లో ఎంత లోతు మేరకు స్నానానికి వెళ్ల వచ్చో ఆ మేరకు భద్రతా చర్యలు తీసుకోవడం లేదు. ప్రస్తుతం కార్తీక మాసంలో వెంటనే ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



నిత్యం పూజలందుకునే జంపెన విశ్వేశ్వరుడు

ముందస్తు జాగ్రత్తలకు ఆదేశాలిచ్చాం



చోడవరం మండలం నదీ పరివాహకంలో స్నాన రేవుల వద్ద ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఇప్పటికే వీఆర్వోలకు ఆదేశాలు జారీ చేశాం. హెచ్చరిక బోర్డులతోపాటు రేవుల వద్ద బారికేడ్లు ఏర్పాటు పనులు చేపడుతున్నాం. స్నానాలు చేసేటప్పుడు భక్తులు అప్రమత్తంగా ఉండాలి.

– తిరుమలబాబు, తహసీల్దార్, చోడవరం

స్నానాలు చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి



నదుల్లో పవిత్రస్నానాలు చేసేటప్పుడు భక్తులందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లోతుగా ఉండే ప్రాంతాలకు వెళ్లవద్దు. పెద్ద రేవుల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. పిల్లలను ఒంటరిగా స్నానాలకు వెళ్లనీయవద్దు.

– శ్రీనివాసరావు, సీఐ, చోడవరం

ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో శరవేగంగా రోడ్డు నిర్మాణం



బి.టి.రోడ్డు పనులు

మాడుగుల రూరల్: ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో అర కిలోమీటరు మేర పొడవునా తారురోడ్డు నిర్మాణం శరవేగంగా సాగుతోంది. ప్రత్యేక మరమ్మతుల నిధుల కింద రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో ఘాట్‌రోడ్డు జంక్షన్ చెరకు కాటా నుంచి పాడేరు రహదారిలో కల్యాణ మండపం వరకు 500 మీటర్ల పొడవున పది మీటర్ల వెడల్పున ఈ రోడ్డు నిర్మిస్తున్నారు. రూ.50 లక్షలతో చేస్తున్నట్టు మాడుగుల ఆర్అండ్‌బీ జేఈ వి.సాయి శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. పనులను ఆయనతోపాటు వర్క్ ఇన్‌స్పెక్టరు పి. దేముడునాయుడు పర్యవేక్షిస్తున్నారు.

నేడు కె.జె.పురంలో వై ఏపీ నీడ్స్ జగన్

మాడుగుల రూరల్: కె.జె.పురం –2 గ్రామ సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ సోమవారం సాయంత్రం తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు. రాత్రికి పల్లె నిద్ర కార్యక్రమం ఉంటుందన్నారు.

శిరిజాంలో..

ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం మంగళవారం మధ్యాహ్నం శిరిజాంలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ, దాని అనుబంధ సంఘాల నేతలు, కార్యకర్తలు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు హాజరు కావాలని కోరారు.

నిరుపేదలకు భరోసా సీఎం రిలీఫ్ ఫండ్

బాధిత కుటుంబానికి రూ.2 లక్షల చెక్కు అందజేసిన ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: ఎంతోమంది నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. మున్సిపాలిటీలోని రామారావుపేటకు చెందిన మాదబత్తుల రవికుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే సీఎం సహాయ నిధి నుంచి రూ.2 లక్షలు మంజూరు చేయించారు. ఈ మొత్తం చెక్కు రూపంలో సోమవారం తన నివాసంలో మృతుడు భార్యకు ఎమ్మెల్యే, కళావతి దంపతులు అందజేశారు. కుటుంబ పెద్దదిక్కు, భర్తను కోల్పోయానని, తన కుమారుడు బ్రెయిన్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడని మృతుడు భార్య ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. బాబు వైద్యానికి అవసరమైన ఖర్చు కోసం సీఎం సహాయనిధి నుంచి మంజూరుకు కృషి చేస్తానని బాధితురాలికి ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, మున్సిపల్ సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, గొలుగొండ జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, కొల్లు శ్రీను, సుర్ల నాయుడు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్ దంపతులు

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఊరేగింపు



గవరపాలెం గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఊరేగింపు

అనకాపల్లిటౌన్: గవరపాలెం గౌరీపరమేశ్వరుల అమ్మవారి నిలుపు మహోత్సవం ఘనంగా జరిగింది. దీపావళి ముందురోజు అమ్మవారి ప్రతిరూపంగా వరి దుబ్బును తెచ్చి, అమ్మవారి ఆలయంలో నిలుపుదల చేశాక, అమ్మవారిని పట్టణ, గవరపాలెం పురవీధుల్లో ఊరేగించారు. ఆదివారం అమ్మవారిని ఆలయంలో నిలుపుదల చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావునాయుడు, ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, కోశాధికారి కొణతాల నూక మహాలక్ష్మీనాయుడు, ఆలయ ప్రతినిధులు కొణతాల మురళీకృష్ణ, పి.వి.రమణ, ప్రసాద్, దాడి కృష్ణ, పి.వి.సత్యనారాయణ, సూరిశెట్టి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో నూకాంబిక ఉత్సవ మండపం ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ పాలకవర్గ సభ్యులు

అనకాపల్లిటౌన్: నూకాంబిక అమ్మవారి ఉత్సవ మండపాన్ని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చేతుల మీదుగా త్వరలో ప్రారంభించనున్నట్లు ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ తెలిపారు. ఆలయ ఆవరణలో ఈవో బండా ప్రసాద్ అధ్యక్షతన సోమవారం దేవస్థాన ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. అమ్మవారి ఆలయ దాతలకు ఉచిత వసతి, ప్రత్యేక దర్శనం కల్పించాలని, భక్తుల టాయిలెట్లను ఆధునికీకరించాలని సభ్యులు తీర్మానించారు. ఆలయ నైరుతి మూల రహదారి పక్కన ప్రసాదం కౌంటర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పాలకవర్గసభ్యులు పాల్గొన్నారు.

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న కాండ్రేగుల సూర్యారావు

అనకాపల్లిటౌన్: జీవీఎంసీ విలీనగ్రామం కొత్తూరు నర్సింగరావుపేట రామాలయంలో శ్రీరామ వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్, సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో పిడుగు విజయలక్ష్మి ఆర్థిక సాయంతో నిరుపేదలకు సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ కాండ్రేగుల సూర్యారావు మాట్లాడుతూ ఏటా దీపావళి సందర్భంగా పేదలకు తోచిన సాయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. సేవా సంఘం కన్వీనర్ చూచుకొండ రమణ, సభ్యులు కశిరెడ్డి సుశీల, బల్లిని నాగమణి, కావలి వరలక్ష్మి పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

అనకాపల్లిటౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడ ఉప్పల వెంకటరాజు కోరారు. క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నెహ్రూచౌక్ నుంచి పెరుగుబజార్ జంక్షన్, రింగ్‌రోడ్డు, రైల్వే స్టేషన్ రహదారి, రామచంద్ర థియేటర్ వరకూ ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛమైన ఆక్సిజన్ లభించాలంటే ప్రతి గృహం వద్ద మొక్కలను నాటి, వాటి పర్యవేక్షణ చూడాలన్నారు. భావి తరాల ప్రజలను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ వీలైనన్ని ఎక్కువ మొక్కలను నాటాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు శరగడం జయలక్ష్మి, వంకాయల ఈశ్వరరావు, ఎస్.నూకరాజు, మైఖేల్ తదితరులు పాల్గొన్నారు.



పర్యావరణ పరిరక్షణ ర్యాలీ నిర్వహిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

ఆ భూములకు పట్టాలిస్తే సాగు చేసుకుంటాం

కొత్తకోట కోళ్లఫారం దళిత లబ్ధిదారుల వేడుకోలు

రావికమతం: కొత్తకోట కోళ్లఫారం దళిత లబ్ధిదారులకు ప్రభుత్వం న్యాయం చేయాలంటూ ఆ సంఘ సభ్యులు వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి సోమవారం వినతి పత్రాన్ని సమర్పించారు. 1985లో గ్రామానికి చెందిన 20 మంది లబ్ధిదారులకు అప్పటి ప్రభుత్వం కోళ్ల ఫారం పెంపకానికి ఆరెకరాల్లో యూనిట్లు మంజూరు చేసింది. మొదటి దఫా బాగానే వ్యాపారం సాగినా తర్వాత కాలంలో వ్యాధుల బారిన పడి కోళ్లు మృతి చెందడంతో వారంతా తీవ్ర నష్టాలు చవిచూశారు. ఆ తర్వాత ప్రభుత్వాలు సైతం పట్టించుకోకపోవడంతో కోళ్లఫారం షెడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆ భూములకు పట్టాలిస్తే ఉమ్మడి వ్యవసాయం చేసుకుని జీవిస్తామని లబ్ధిదారులు పలుమార్లు అధికారులకు విన్నవించినా స్పందన లేదని ఆ సంఘ నాయకులు మల్లేటి రాజు, చెక్కా నాగేశ్వరరావు, రాజారావు, బుంగా నల్లప్ప తదితరులు రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఇప్పటికైనా పట్టించుకోకుంటే దీక్షలకు దిగుతామని హెచ్చరించారు.



వినతిపత్రం అందిస్తున్న కోళ్లఫారం లబ్ధిదారులు

పుస్తకమే సమస్తం..

- ఉపయోగించుకున్న విద్యార్థుల జీవితాల్లో అభ్యుదయం
- నేటి నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

రావికమతం: పుస్తకమే సమస్తం... చదువుకుంటూ పోతుంటే ప్రపంచం గుప్పిట పట్టినట్టే అంటూ ఎందరో మహానుభావులు చెప్పిన మాటలివి. అటువంటి పుస్తక భాండాగారాలైన గ్రంథాలయాలు సమాజానికే చక్కని గురువులనడంలో అతిశయోక్తి కాదు. ఎందుకంటే గ్రంథాలయాల్లో పోటీ పరీక్షల మెటీరియల్ తోపాటు దినపత్రికలు, రామాయణ, మహాభారతం వంటి ఎన్నో విలువైన గ్రంథాలు ఉన్నాయి. ప్రపంచంలో ఒక ఎత్తుకు ఎదిగిన వారంతా గ్రంథాలయాలను ఉపయోగించుకున్న వారేనన్న నానుడి కూడా ఉంది. ప్రస్తుత కాలంలో ఇవి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

మండలంలో రెండు శాఖా గ్రంథాలయాలున్నాయి. కొత్తకోటలో 7 వేలు, రావికమతంలో 5 వేల విలువైన పుస్తకాలున్నాయి. నిత్యం 200–300 మధ్య చదువరులు వస్తుంటారు. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న గ్రంథాలయాలను పిల్లలకు మరింతగా చేరువ చేసేందుకు నవంబరు 14 నుంచి 20వ తేదీ వరకూ ఏటా వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఆ వారం రోజుల్లో విద్యార్థులకు ఎన్నెన్నో పోటీలు నిర్వహించడమే కాకుండా పుస్తకం, చదవడం విలువ తెలియజేసే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులు, సంఘ సేవకులు ఈ కార్యక్రమంలో ఏటా పాల్గొంటూ విజయవంతం చేస్తున్నారు. ఇటువంటి గ్రంథాలయాలను డిజిటలైజేషన్ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా, అమలులో మాత్రం ఆలస్యమవుతోందని పలువురు చదువరులు వాపోతున్నారు. ఆ దిశగా అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కొత్తకోట గ్రంథాలయంలో విలువైన పుస్తకాలు

వారోత్సవాల్లో పోటీలు ఇవే...

రోలుగుంట/ మాడుగుల/చీడికాడ: గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పలు పోటీలు నిర్వహించనున్నట్టు రోలుగుంట, మాడుగుల, చీడికాడ గ్రంథపాలకులు వరలక్ష్మి, వై. వేంకటేశ్వర్లు, ఎం.ఎస్.ఎల్. జోగేశ్వరి తెలిపారు. తొలి రోజు మంగళవారం ఉదయం జాతీయ జెండా ఆవిష్కరణ, చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలంకరణ, జ్యోతి ప్రజ్వలన, మధ్యాహ్నం మ్యూజికల్ చైర్, 15న జూనియర్ సీనియర్ విభాగాల్లో చిత్రలేఖనం, 16న వ్యాసరచన, 17న పుస్తక ప్రదర్శన, సభ్యత్వ సేకరణ, చదరంగం, 18న క్విజ్ పోటీలు, 19న మహిళా దినోత్సవం, 20న ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతుల ప్రదానం చేస్తామన్నారు.

చీకటి వెలుగుల రంగేళి.. దీపావళి

- పల్లె లోగిళ్లలో దివ్వెల వెలుగు
- ఊరూవాడా సంబరాలు
- వీధివీధిన బాణసంచా మోతలు



మాడుగుల: సత్యవరంలో దివ్వెలు వెలిగిస్తున్న దృశ్యం

మాడుగుల/బుచ్చెయ్యపేట/రావికమతం/కె.కోటపాడు/మాడుగుల రూరల్/చీడికాడ: అశ్వయుజ అమావాస్య రోజున నరక చతుర్దశిని చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా దీపావళి పండగను వాడవాడలా ఘనంగా నిర్వహించుకున్నారు. ఇంటింటా దీపాలు.. లోగిళ్లలో ప్రమిదల వెలుగులు... వీధుల్లో పటాకుల మోతలు... ఇలా చిన్నా పెద్ద, పేద, ధనిక తారతమ్యం లేకుండా వెలుగు జిలుగుల వేడుక దివ్వెల పండగను ఎంతో ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. హిందువుల పవిత్ర పండగల్లో ఒకటైన ఈ పర్వదినాన్ని ప్రజలు సంబరంగా నిర్వహించారు. ఆదివారం నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో చెరకు గడలతో తయారు చేసిన దివ్వెలు వెలిగించి ఇంటిల్లిపాది ఆనందంగా గడిపారు. పలువురు పోటాపోటీగా కాకర్లు, టపాసులు, మతాబులు, చిచ్చుబుడ్లు కాల్చారు.



రావికమతంలో దివ్వెలు కొడుతున్న ఒక కుటుంబం



బుచ్చెయ్యపేటలో దివ్వెలు కొడుతున్న కుటుంబ సభ్యులు



మాడుగుల రూరల్: కింతలిలో చెరకు గడలతో దివ్వెలు వెలిగించిన ప్రజలు



కె.కోటపాడులో చెరకు దివ్వెలతో దీపావళి చేస్తున్న ప్రజలు



అర్జునగిరిలో చెరకు గడలతో దీపాలు వెలగించిన ఒక కుటుంబం

చెడ్డీగ్యాంగ్‌పై పోలీసుల హెచ్చరిక

అనకాపల్లిటౌన్: మండలంలో చెడ్డీ గ్యాంగ్ పేరుతో ఒక ముఠా నేరాలకు పాల్పడుతోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రూరల్ సీఐ రవికుమార్ సోమవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. కొద్ది రోజుల క్రితం తిరుపతిలో చెడ్డీ గ్యాంగ్ కదలికలు సీసీ ఫుటేజ్‌లో కనిపించిందన్నారు. జిల్లాలో కూడా ఈ ముఠా నేరాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. ప్రధానంగా రాత్రి సమయంలో గృహాలకు తాళాలు పగలగొట్టి దొంగతనాలకు పాల్పడుతారని పేర్కొన్నారు.